క్లుప్తంగా

చేప పిల్లలకు బదులు నగదు ఇవ్వండి



రుద్రూర్: చేప విత్తనాల కొనుగోలుకు నగదు ఇవ్వాలని పోతంగల్ మండల మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు మాగిరి శ్రీనివాస్, ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం పోతంగల్ తహసీల్ కార్యాలయానికి మత్స్యకారులతో కల్సి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం నాణ్యత లేని విత్తనాలు ఇవ్వడం వల్ల చేప సరిగా పెరగడం లేదన్నారు. నగదు అందజేస్తే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి చెరువులో పెంపకం చేస్తామని పేర్కొన్నారు. వివిధ గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

పంటల నమోదును పూర్తి చేయాలి

నవీపేట: గ్రామాలలో చేపడుతున్న పంటల నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ ఏఈవోలకు సూచించారు. నాళేశ్వర్‌లో ఈ సీజన్‌లో రైతులు వేసిన పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏఈవోలు, రైతులతో మాట్లాడారు. రైతులు వేసిన పంటలపై క్రాప్ బుకింగ్ యాప్‌తో నమోదు ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు. ఏఈవోలకు రైతులు సహకరించాలని కోరారు. ఏవో సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



బోధన్: సాలూర మండలంలోని సాలూర క్యాంప్ గ్రామానికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్యే కేవీ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరపున మంగళవారం సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో కేవీ రెడ్డి మనుమడు ప్రభురెడ్డి దంపతులు విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, గేమ్స్ కిట్స్ పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా ట్రస్ట్ ద్వారా పాఠశాలల పునఃప్రారంభం సమయంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నారు. పాఠశాల హెచ్ఎం మంజుష, గ్రామ పెద్దలు అల్లె రమేష్, కందుల శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్: మండల కేంద్రానికి చెందిన మక్దూం అలీ అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్, సీఎం సహాయ నిధి నుంచి రూ.రెండు లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించి అందించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అలీ కుటుంబ సభ్యులకు మంగళవారం ఎల్‌వోసీని అందజేశారు.

ఆర్థిక సహాయం

ఆర్మూర్‌టౌన్: ఏర్గట్ల గ్రామానికి చెందిన రవి సునీత దంపతుల కుమార్తె నివేదిత ప్రమాదవశాత్తు కిందపడి చేతి ఎముక విరిగి బయటకు వచ్చింది. చికిత్స చేయించడానికి స్థోమత లేకపోవడంతో సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నివేదిత ప్రస్తుతం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

సబ్‌స్టేషన్ సందర్శన

ఆర్మూర్‌టౌన్: మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలోని సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ మంగళవారం సందర్శించారు. గ్రామంలో విద్యుత్ సరఫరా విషయంలో నెలకొన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరలో అంతరాయం ఉందని, లైన్‌మన్ గోపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఈకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

పోలీసుల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారు ప్రాంతాలను పోలీసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ సబ్‌డివిజన్‌లోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది రైల్వేస్టేషన్, పెర్కిట్, నల్లపోచమ్మ ఆలయం, అంకాపూర్, గూండ్ల చెరువు ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాలను విక్రయిస్తున్న విషయమై తనిఖీ చేశారు. అలాగే కిరాణ దుకాణాలు, పాన్‌షాప్‌లలో సైతం తనిఖీలు చేపట్టారు. ఎక్కడైన గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీలో రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు అశోక్, గంగాధర్, అంజమ్మ, అనిల్ రెడ్డి, శ్రీనివాస్, అరాఫత్ పాల్గొన్నారు.

మేనేజర్ సేవలు మరువలేనివి

మాక్లూర్: గుత్ప గ్రామ ప్రజలకు గ్రామీణ బ్యాంకు మేనేజర్ గోపికృష్ణ చేసిన సేవలు మరువలేనివని స్థానిక తాజా మాజీ సర్పంచ్ గంట చిన్నయ్య అన్నారు. గుత్ప బ్రాంచ్ మేనేజర్ బదిలీ కావటంతో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్తగా వచ్చిన మేనేజర్‌కు స్వాగతం పలికి, బదిలీపై వెళ్లిన గోపికృష్ణకు వీడ్కోలు పలికారు. జీపీ కార్యదర్శి రానా, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల అప్రమత్తతే శ్రీరామరక్ష

- విద్యుత్ మరమ్మతుల సమయంలో ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు
- సమస్యలు వస్తే విద్యుత్ అధికారులను సంప్రదించడమే మేలు
- మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



బోధన్‌రూరల్: బోధన్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురవడం ఆలస్యం కావడంతో ఇప్పుడిప్పుడే అన్నదాతలు పూర్తిస్థాయిలో పంటల సాగులో నిమగ్నమయ్యారు. పంటల సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు, కూలీలు అజాగ్రత్తల వల్ల విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు. బోధన్ డివిజన్‌లో పరిధిలోని 39 సబ్ స్టేషన్‌లలో 41,034 వ్యవసాయ బోరు మోటార్ కనెక్షన్‌లు ఉన్నాయి. బోధన్ డివిజన్ పరిధిలో ఏప్రిల్ 2023 నుంచి జూన్–2024 వరకు విద్యుత్ ప్రమాదాల వల్ల 10 మంది ప్రాణాలు కోల్పోగా వీరిలో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు (ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు) చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించారు. మిగిలిన నలుగురు మృతుల కుటుంబాలకు ఎక్స్‌గేషియా అందించేందుకు ప్రకియ కొనసాగుతుంది. 18 మూగ జీవాలు మృత్యువాత పడగా వాటిలో 13 మూగ జీవాలకు నష్ట పరిహారం అందించారు. విద్యుత్ ప్రమాదాలకు గురవ్వకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ ప్రమాదం జరిగి చనిపోతే ఎక్స్‌గ్రేషియా కోసం బాధిత కుటుంబాలు ఎలా దరఖాస్తు చేసుకోవాలి.. తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే ఎక్స్‌గ్రేషియా..

విద్యుత్ ప్రమాదాల వల్ల చనిపోతే మనుషులకు రూ.5 లక్షలు, మూగ జీవాలకైతే రూ.7 వేల నుంచి 40 వేల వరకు ఎక్స్‌గ్రేషియా అందిస్తారు. దీని కోసం మృతుడి డెత్ సర్టిఫికేట్, ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్ట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సంబంధిత ప్రాంత ఏఈకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులపై డీఈఈ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తారు. విద్యుత్ శాఖ నుంచి వచ్చే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాలోంచి మృతుని కుటుంబానికి రూ.50 వేలు నగదు రూపంలో మిగిలిన రూ.4లక్షల 50వేలు మృతుని కుటుంబసభ్యులందరికీ సమానంగా వారి బ్యాంక్ ఖాతాల్లో 5 ఏళ్ల కాలవ్యవధితో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. సొమ్మును 5 ఏళ్ల తర్వాత బ్యాంక్ వడ్డీతో కలిపి అందిస్తారు. ఇక విద్యుత్ ప్రమాదాల వల్ల మూగ జీవాలు పెద్దవి(ఆవులు, గేదేలు) చనిపోతే రూ.40వేలు, చిన్న మూగ జీవాలు(గొర్రెలు, మేకలు వంటివి) చనిపోతే రూ.7 వేల నష్ట పరిహారం అందిస్తారు. దీని కోసం ఎఫ్ఐఆర్, వెటర్నరీ డాక్టర్ పోస్ట్‌మార్టం రిపోర్ట్, ఓనర్ ఆధార్ జిరాక్స్‌లను అందించాలి.

విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్లు	
బోధన్ డీఈఈ	7901093941
బోధన్ టౌన్ ఏఈ 1	9440811625
బోధన్ టౌన్ 2, సాలూర ఏఈ	9491058659
బోధన్ రూరల్ ఏఈ	9440811626
రెంజల్ ఏఈ	9440811627
ఏడపల్లి ఏఈ	9440811628
రుద్రూర్ ఏఈ	7901678178
కోటగిరి ఏఈ	9440811654
పోతంగల్ ఏఈ	9440224178
మోస్రా, చందూర్ ఏఈ	9440814943
వర్ని ఏఈ	944011656

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలు

- పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతుంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి.
- బోరు మోటార్ బోర్డులు, స్టార్టర్లు వర్షానికి తడవకుండా అమర్చుకోవాలి.
- బోరు మోటార్లను ఆన్, ఆఫ్ చేసే సమయాల్లో చేతులు తడిగా లేకుండా చూసుకోవాలి, గ్లౌవ్స్ తప్పనిసరిగా వాడాలి.
- మోటార్లుకు మరమ్మతులు నిర్వహించే సమయంలో విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఎల్‌సీ తప్పనిసరిగా తీసుకోవాలి.
- రైతులు ఎప్పుడూ తమ వెంట నాణ్యమైన టెస్టర్, కాళ్లకు పాదరక్షలు వేసుకునే కరెంట్‌ను చెక్ చేయాలి.
- పిడుగులు పడే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు దూరంగా ఉండాలి.
- విద్యుత్ సమస్యలు వస్తే స్థానిక ట్రాన్స్‌కో ఏఈలు, లైన్‌మెన్‌లకు సమాచారం అందించాలి.
- ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌లను ఆశ్రయించకుండా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో మరమ్మతులు చేయించుకోవాలి.

ఫిర్యాదు చేయాలి



పొలాల్లో విద్యుత్ సమస్యలు వస్తే ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌లను ఆశ్రయించకుండా సంబంధిత ఏఈలు, సిబ్బందికి సమాచారం ఇచ్చి మరమ్మతులు చేయించుకోవాలి. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించపోతే బోధన్ డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. ఎవరైనా విద్యుత్ ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పేతే ఏఈను సంప్రదించి అవసరమైన పత్రాలను అందజేయాలి. ప్రమాదాల నివారణ కోసం విద్యుత్ శాఖ సలహాలు, సూచనలు పాటించాలి.

– ఎండీ ముక్తార్, ట్రాన్స్‌కో డీఈఈ, బోధన్

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



రైతు వేదికలో వీసీ ద్వారా వీక్షిస్తున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): పంటలకు ఎరువుల వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సును రైతులు డొంకేశ్వర్ రైతువేదిక నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వానాకాలం పంటలలో ఎరువుల సాగుపై సలహాలు, సూచనలు అందించారు. వీసీలో సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి, ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల డిమాండ్లు నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఎడపల్లి(బోధన్): ప్రభుత్వం తమకు ఇచ్చిన అభయ హస్తం హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్ కార్యాలయం ఎదుట ముదిరాజ్ సంఘం నేతలు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణ మాట్లాడుతూ.. జీవో–15 బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి మార్చాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు ఒడ్డెన్న, కార్యదర్శి రాజ్‌కుమార్, సెక్రటరీ జనార్దన్, తదితరులున్నారు.

రుణమాఫీ నిబంధనలను సవరించాలి



మాట్లాడుతున్న నాయకుడు శోభన్

ఆర్మూర్‌టౌన్: జీవో–567 ప్రకారం రైతుల రుణ మాఫీకి రూపొందించిన నిబంధనలను సవరించి రూ. 2 లక్షల రుణం పొందిన రైతులకు లబ్ధి చేకూర్చాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్ కార్డు ఉన్న వారికే రుణ మాఫీ వర్తింపజేశారన్నారు. రాష్ట్రంలో 72 లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 4 3లక్షల మందికి మాత్రమే అప్పులిచ్చాయి. గత డిసెంబర్‌లో రీషెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీని వర్తింపజేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు తోగటి భూమన్న పాల్గొన్నారు

కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించండి

ఎడపల్లి(బోధన్): కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణ సౌకర్యం కల్పించాలని, బ్యాంకులో రుణాలు చెల్లించిన వారికి గతంలో రుణమాఫీ వచ్చిన వారికి కూడా వర్తింపజేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎడపల్లి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో కాశ రవి, మల్లేష్, రెంజల్ చిన్న పోశెట్టి, సుదర్శన్, జల్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లపు వెంకటేశ్

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఆరు హామీలలో రెండు మాత్రమే అమలవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపు వెంకటేష్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలని సవరించి, పేదలపై భారం వేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలను చైతన్యం చేసి పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం సహాయ కార్యదర్శి శోభన్ నాయకులు కుతాడి ఎల్లయ్య, భూమన్న, అశోక్, గంగామణి, కుల్దీప్ శర్మ, సాయిలు, కిషన్, రసీదా బేగం, కలీం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



ఎడపల్లి: మంగళ్‌పాడ్ గ్రామంలో ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్, గౌడ కులస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ బాధ్యత మంగళ్‌పాడ్ గ్రామస్తులు తీసుకోవాలని సూచించారు.

బీడీ కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత మల్లేశ్

రుద్రూర్: ఎన్నికలకు ముందు బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో మంగళవారం బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీడీ కార్మికులకు చేసిన వాగ్దానాలను అమలు చేయనందున కేసీఆర్‌ను గద్దె దించారని గుర్తు చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేసే అన్ని కేటగిరీల కార్మికులకు రూ.4016 జీవనభృతి ఇవ్వాలని, కటాఫ్ డేట్‌ను తొలగించాలని, రేషన్ కార్డులు లేని వారికి రేషన్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరుణ, కళావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్ పీహెచ్‌సీ తనిఖీ

- సిబ్బంది గైర్హాజరుపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9:30 గంటలకే పీహెచ్‌సీకి చేరుకున్న ఆయన గదులను పరిశీలించారు. అప్పటికి ల్యాబ్ టెక్నీషియన్ తప్ప మిగతా సిబ్బంది ఎవరూ విధులకు హాజరు కాలేదు. హాజరు రిజిస్టర్‌ను చూసిన డీఎంహెచ్‌వో మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్సు, ఫార్మాసిస్టు, అటెండ్లరకు ఆబ్సెంట్ వేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నందుకు మెడికల్ ఆఫీసర్‌పై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారంతా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆస్పత్రి నిర్వహణ గాడి తప్పిందని ఆగ్రహించారు.

అంగన్‌వాడీ బాట



మోర్తాడ్: మోర్తాడ్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ పాఠశాలల ఆవశ్యకతను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కార్యకర్తలు జ్యోతి, సువార్త, సులోచన, శారద, గంగాజమున, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులతో రైతులకు తిప్పలు



బోధన్ - బైంసా జాతీయ రహదారిలో ఆచన్‌పల్లి వద్ద పొలాల్లోకి చేరిన కాలువల నీరు

బోధన్‌రూరల్: బోధన్– బైంసా 161బీబీ జాతీయ రహదారి నిర్మాణ పనులతో రోడ్డు వెంబడి ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి వెంబడి ఉన్న కాలువలు, లింక్ రోడ్డులు, పనుల వల్ల మూసుకుపోవడంతో వర్షపు నీరు రైతుల పొలాల్లోకి చేరుతున్నాయి. పలుచోట్ల నూతన రోడ్డు వెంబడి వేసిన మొరం వర్షపు నీటితో కిందకు జారి రైతుల పొలాల్లో మొరం కుప్పలు జమ అవుతున్నాయి. దీంతో తాము సాగు చేస్తున్న పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఆచన్‌పల్లి, పెగడాపల్లి, లంగ్డాపూర్ శివారులో మంగళవారం కురిసిన వర్షానికి హైవే వెంబడి ఉన్న రైతుల పొలాలు నీట మునిగాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ కేజీబీవీలో కాంట్రాక్టు పద్ధతిన పలు పోస్టుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వనజ, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి వినోద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక హెడ్ కుక్, ఇద్దరు అసిస్టెంట్ కుక్‌లు, ఒక స్వీపర్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. హెడ్ కుక్‌గా పనిచేయడానికి పదోతరగతి పాసైనవారు, అసిస్టెంట్ కుక్, స్వీపర్‌గా పనిచేయడానికి ఏడో తరగతి పాసైన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 18 నుంచి 20 వరకు తమ దరఖాస్తులను మండల విద్యావనరుల కేంద్రంలో సమర్పించాలని కోరారు.

వంట మనిషి పోస్టుల కోసం..

నందిపేట్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇద్దరు వంట మనిషి పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శాంతి కుమారి పేర్కొన్నారు. ఉద్యోగానికి మహిళా అభ్యర్థులై ఉండి 7వ తరగతి పాస్ అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20లోగా కేజీబీవీలో దరఖాస్తులను అందించాలని కోరారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ బైపాస్ మార్గంలో రోడ్డు పక్కన గల డ్రైనేజీపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. బైపాస్ మార్గం వద్ద వర్షపు నీరు నిలువ కాకుండా డ్రైనేజీని ఏర్పాటు చేశారు. కాగా డ్రైనేజీపై సిమెంటు తొలగిపోవడంతో గుంత ఏర్పడింది. వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కల్కి–2898ఏడీ (తెలుగు) – 10.15, 2.00, 5.45, 9.30
స్క్రీన్-2 –	కల్కి –2898ఏడీ (3డీ తెలుగు) – 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3 –	భారతీయుడు–2 (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	భారతీయుడు–2 (తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15

కాలనీల రోడ్లన్నీ బురదమయం



నందిపేట బర్కత్‌పుర కాలనీలో రోడ్డు పరిస్థితి



రాజనగర్‌లో హనుమాన్ మందిరం వద్ద ..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే కాలనీలో రోడ్లు చిత్తడిగా మారుతుండడంతో స్థానికులు బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నందిపేటలోని బర్కత్‌పురకాలనీలో, దయానంద్ రైస్‌మిల్ వద్ద గల రోడ్డులో, రాజనగర్ కాలనీలో రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. కాలనీవాసులు రోడ్ల దుస్థితిపై అధికారుల దృష్టికి తీసువెళ్లిన ఫలితం లేకుండా పోయింది. కంటితుడుపు చర్యగా మొరం వేసి వదిలేస్తున్నారు. దీంతో వర్షానికి మరింత బురదమయమం కావడంతో ప్రజలకు సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పెర్కిట్: ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో గల ఇటుకల బట్టి వద్ద పనిచేస్తున్న గర్భిణి మహిళలకు బాలింతలకు పౌష్టికహారంపై సా ధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ. పిల్లలను బాలకార్మికుల నుంచి విము క్తి చేసి విద్యను అభ్యసించే విధంగా చూడాల న్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్స్ యా క్సెస్ టూ జస్టిస్ ఫర్ అల్ ప్రాజెక్ట్‌లో బాగంగా కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాధన సంస్థ టౌన్ కోఆర్డినేటర్ సమక్షంలో బాలింతలకు పిల్లలకు భోజనం అందజేశారు. అలాగే పిల్లకు పలకలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్వైజర్ భిక్షింగ్, కేసు వర్కర్ ముజాహిద్, ఎన్జీవో ఆర్గనైజర్ సంగీత, అంగన్వాడీ టీచర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.